క్లుప్తంగా

అమ్మవార్లకు చీర, సారె సమర్పణ



అమ్మవార్లకు చీర,సారెను సమర్పించేందుకు వెళుతున్న మహిళలు

జంగారెడ్డిగూడెం: శ్రీనివాసపురం హరిజనపేటలో జీర్ణోద్ధారణ గావించిన రామాలయం వద్ద నుంచి గ్రామ దేవతలైన గంగానమ్మకు, సోమాలమ్మలకు పసుపు, కుంకుమ, చీర, సారె హరిజన మహిళలు భక్తి శ్రద్ధలతో బుధవారం సమర్పించారు. విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు దమిసెల్లి ముక్కయ్య, కంచర్ల శ్రీరాములు, దమిసెల్లి బుచ్చి రాజు, మహిళలు, విశ్వ హిందూ పరిషత్ జంగారెడ్డిగూడెం ప్రఖండ అధ్యక్షులు తోట రామకృష్ణ పాల్గొన్నారు.

పారిజాతగిరిలో తిరుప్పావై పారాయణం



గోకుల తిరుమల పారిజాతగిరిలో గోదాదేవికి పూజలు నిర్వహించిన దృశ్యం

జంగారెడ్డిగూడెం: గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ రోజు 17వ రోజు సందర్భంగా ఆలయంలో వేకువ జామునే గోదా దేవికి, శ్రీకృష్ణుడికి విశేష పూజలు, తిరుప్పావై సేవాకాలం, మంగళాశాసనం, పాశుర విన్నపం, తీర్థ ప్రసాద గోష్ఠి, మొదలగు కార్యక్రమాలు ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవి కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు కార్యనిర్వహణ అధికారి మానికల రాంబాబు పర్యవేక్షణలో దర్శన ఏర్పాట్లు చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



ఆలయంలో కొలువైన అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీఅయ్యప్పస్వామి వారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం తొలి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు తేజశర్మ స్వామివారికి పంచామృతాభిషేకాలు, ఇరుముడి సమర్పించుకున్న స్వాములు నెయ్యాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ కోశాధికారి గుండ్ల వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో చిన్ని వాసు స్వామి, గంగు జగన్మోహన్ రెడ్డి, అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవో మణికుమారి

టి.నరసాపురం: మండల ఎంపీడీవోగా జి.మణికుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు టి.నరసాపురం ఎంపీడీవోగా పని చేసిన ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. టి.నరసాపురం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న మణికుమారికి పూర్తి అదనపు బాధ్యతలతో ఎంపీడీవోగా జిల్లా అధికారులు నియమించారు. ఈమె గతంలో సుదీర్ఘ కాలం పాటు పూర్తి అదనపు బాధ్యతలతో చింతలపూడి ఎంపీడీవోగా పని చేశారు.

వరి కుప్ప దగ్ధం



అగ్నికి ఆహుతైన వరి కుప్ప

చింతలపూడి: మండలంలోని ప్రగడవరం రామరాజు కుంట చెరువు వద్ద ఒక రైతుకు చెందిన వరి కుప్ప బుధవారం అగ్నికి ఆహుతయ్యింది. అంకంపాలెం గ్రామానికి చెందిన నందిపాము మారేషుకు చెందిన ఎకరం ముప్పై సెంట్ల పొలంలో పండించిన వరి పంటను కుప్ప వేశాడు. బధవారం వరికుప్పకు నిప్పు అంటుకుంది. గ్రామస్తుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే 90 శాతం వరి ధాన్యం కాలి బూడిదగా మారాయి. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో వరి పంట పూర్తిగా దగ్ధం అయ్యిందని రైతు మారేసు తెలిపాడు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని వేడుకొంటున్నాడు.

నూతన సంవత్సర వేళ.. ఆనందాల హేల



ద్వారకాతిరుమల: మాజీ హోం మంత్రి వనితకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ద్వారకాతిరుమల: కైకలూరులో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న రాజబాబు



బుట్టాయగూడెం: బాలరాజు, రాజ్యలక్ష్మిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న సర్పంచ్‌ల బృందం



జంగారెడ్డిగూడెం: నూతన సంవత్సర వేడుకల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు,



జంగారెడ్డిగూడెం: నూతన సంవత్సర వేడుకలు నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి



జంగారెడ్డిగూడెం: కేక్‌ను కట్ చేస్తున్న జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంట వేడుకల సందడి
- భారీగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులను ఆయా శాఖల సిబ్బంది కలుసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాధరావును నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అలాగే తన కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి నూతన సంవత్సర కేక్‌ను కట్ చేసి సిబ్బందికి, కౌన్సిలర్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని శ్రీనివాసపురంలో నిర్వహించిన వేడుకల్లో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమజ్యోతి పాల్గొన్నారు. కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి ముప్పిడి శ్రీను, వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో..

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలో నూతన సంవత్సర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్ధ రాత్రి నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ అనేక మంది నినాదాలు చేశారు. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఇంట నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే బాలరాజుకు ఆయన సతీమణి తెల్లం రాజ్యలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉండగా బుట్టాయగూడెంలోని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, కరాటం రెడ్డినాయుడు, సాయిబాబా ఇంటి వద్ద ఈ వేడుకల సందడి నెలకొంది.

మాజీ మంత్రి వనితకు శుభాకాంక్షలు

ద్వారకాతిరుమల: మాజీ హోంమంత్రి తానేటి వనితకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. దీంతో యర్నగూడెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం పార్టీ శ్రేణులతో కోలాహలంగా మారింది. ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, దాకారపు బంగారమ్మ, మల్లెపూడి నాగమణి, పసుపులేటి ఏసుబాబు, షేక్ భాషా, గుమ్మడి శ్రీను, ప్రత్తిపాటి యోహాను, బోరుగడ్డ రాజారావు, దాకారపు అగ్గియ్య, నల్లంటి రామారావు, దాసరి రాంబాబు, తదితరులు వనితకు పూల బొకేలను అందించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజబాబు, భోగరాజు సాయికృష్ణలు వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావును కైకలూరులో ఆయన నివాస గృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దమ్ము చేలలో పక్షుల సందడి



వడ్డిగూడెం చేలలో సందడి చేస్తున్న పక్షులు

భీమడోలు: దాళ్వా పంట దమ్ములు ఊపందుకున్నాయి. దమ్ము చేస్తున్న చేలల్లో వచ్చే పురుగులను తింటూ పక్షులు కనువిందు చేస్తున్నారు. కొల్లేరుకు సమీపంలోని భోగాపురం, వడ్డిగూడెం, భీమడోలు, ఎంఎంపురం, సాయన్నపాలెం గ్రామాల్లో దమ్ము చేలల్లో పక్షులు ఆకట్టుకుంటున్నాయి.

తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు



సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ నాగార్జున

దెందులూరు: అతి తక్కువ వడ్డీ రేట్లతో అందించే వివిధ రుణాలను సద్వినియోగం చేసుకోవా లని దెందులూరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ టి.నాగార్జున కోరారు. బుధవారం స్థానిక బ్యాంకు కార్యాలయంలో బ్యాంక్ అకౌంటెంట్ ఉప్పలపాటి రామకృష్ణతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. తమ ఖాతాదారులకు సీనియర్ సిటిజన్‌కు 8.6 అత్యధిక వడ్డీని ఫిక్స్ డిపాజిట్లపై అందిస్తున్నామని, ఏడాది కాలపరిమితికి రూ.500లకే ప్రమాద బీమా 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏడాది కాల పరిమితిలో రూ.వెయ్యి చెల్లించి పాలసీ తీసుకుంటే మృతుల కుటుంబానికి రూ.20 లక్షలు ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు.

వృద్ధులకు వస్త్రాలు, దుప్పట్ల పంపిణీ



బుట్టాయగూడెం: వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే



లింగపాలెం: దుప్పట్లు పంపిణీ చేస్తున్న స్వర్ణపాల్ చారిటీ సభ్యులు

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన గుళ్లపూడిలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని చర్చిలో పాస్టర్ ఫిలిప్స్ ఏర్పాటు చేసిన నూతన వస్త్రాలను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రతీ ఏటా కొత్త సంవత్సరంలో గుళ్లపూడి చర్చిలో నూతన వస్త్రాలను వృద్ధులకు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్లం రాముడు, తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ పాల్, డానియేల్ పాల్ మినిస్ట్రీస్ ఔదార్యంతో

లింగపాలెం: మండలంలోని బోగోలు గ్రామ పంచాయతీ బెతెస్తా ప్రార్థన మందిరంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని దైవజనులు కె.విజయరాజు ఆధ్వర్యంలో వృద్ధులకు, పేదవారికి డానియల్ పాల్ మినిస్ట్రీస్ వారు అందజేసిన దుప్పట్లు స్వర్ణపాల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు గుడిపూడి కుమార్ మంగళం, దైవజనులు విజయరాజు చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్ మంగళం మాట్లాడుతూ ప్రస్తుతం చలికాలంలో ఘననీయంగా తగ్గిన ఉష్ణోగ్రతలతో చలికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు ఉపశమనం లభించిందన్నారు. కార్యక్రమంలో సంఘ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో హైటెక్ హరిదాసు

గణపవరం: సంక్రాంతి రోజుల్లో సందడి చేసే హరిదాసులు మారుతున్న కాలంతో పాటు సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ఫలితంగా సాంకేతిక విప్లవం ముందు సంప్రదాయం వెలవెలబోతుంది. ప్రస్తుత సంక్రాంతి సీజన్‌లో ఏ గ్రామంలో చూసినా హైటెక్ హరిదాసులే కనిపిస్తున్నారు. మోటార్ సైకిల్‌కు మైక్ సెట్‌ను అమర్చి, రికార్డు చేసిన సంకీర్తనలు వినిపిస్తూ రయ్‌రయ్ మంటూ వీధులను చుట్టేస్తున్నారు. ఒక కూడలి వద్ద ఆగి కొంతసేపు పాటలు వినిపిస్తూంటే చుట్టుపక్కల మహిళలు బియ్యం, డబ్బులు, కూరగాయలు వంటివి తెచ్చి అక్షయ పాత్రలో వేసి వెళుతున్నారు. హరిదాసులకు నేడు ఆదరణ కరువైందని గణపవరం చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతున్న కృష్ణాజిల్లాకు చెందిన శివయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి తర్వాత తోపుడు బండిపై అరటిపండ్ల వ్యాపారం చేసుకుంటానని ఆయన తెలిపారు.



హరిదాసుకు బియ్యం వేస్తున్న యువతి

పాడి రైతులకు బహుమతుల అందజేత

ద్వారకాతిరుమల: పాడి రైతులు మరింత పాల దిగుబడిని సాధించి ఆర్థిక స్వావలంబన పొందాలని వైఎస్సార్‌సీపీ మండల నేత, గ్రామ మాజీ సర్పంచ్ పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు సూచించారు. నూతన సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని మండలంలోని రామన్నగూడెంలో, తిరుమల డెయిరీ ఆధ్వర్యంలో పాలసేకరణ కేంద్రం వద్ద బుధవారం ఉదయం పాడి రైతుల సమావేశాన్ని నిర్వహించారు. అందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమేశ్వరరావు చేతుల మీదుగా రైతులకు ప్రోత్సాహక బహుమతులుగా పాల క్యాన్లు, దాణా, మందులు, స్వీట్లు, కొత్త సంవత్సరం క్యాలెండర్లను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో భీమేశ్వరరావు మాట్లాడుతూ తిరుమల డెయిరీ వారు అందిస్తున్న సహాయ సహకారాలను రైతులు సద్వినియోగం చేసుకొని, పాల దిగుబడులు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, ప్రసాదరావు, సుబ్రహ్మణ్యం, ఇస్మయిల్, వెంకట రమణ తదితరులున్నారు.



రైతులకు పాల క్యాన్లు అందజేస్తున్న భీమేశ్వరరావు

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణకు ఫిబ్రవరి తుది గడువు

జంగారెడ్డిగూడెం: రిటైర్డ్ ఉద్యోగులు ఫిబ్రవరి నెలాఖరులోగా లైఫ్ సర్టిఫికెట్‌లను సమర్పించాలని జంగారెడ్డిగూడెం ఏటీవో చంద్రయ్య తెలిపారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో ఏటీవో, ఎస్‌టీవోలను ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పూలబొకేను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏటీవో మాట్లాడుతూ పింఛన్ పొందే ప్రతీ రిటైర్డ్ ఉద్యోగి వారి లైఫ్ సర్టిఫికెట్‌ను ఏఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యదర్శి కె.నాగేశ్వరరావు, కె.బాలకృష్ణ, కె.గాంధీ, వీరాస్వామి, దాదాసాహెబ్, త్రినాథరావు, ఆర్.సత్యనారాయణ, లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని వేంపాడు గ్రామశివారు పొలాల్లో ఒక కోడి పందేల స్థావరంపై బుధవారం ఉదయం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ. 5 వేలు నగదు, 2 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

శ్రీవారి పథకాలకు విరాళం



దాత అప్పిరెడ్డికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదానం, గోసంరక్షణ పథకాలకు ఇద్దరు భక్తులు బుధవారం వేరువేరుగా రూ.5,43,116 విరాళంగా అందజేశారు. ఏలూరుకు చెందిన శ్రీనివాస్ నిత్యాన్నదాన పథకానికి రూ.2,21,000, గో సంరక్షణ పథకానికి మరో రూ.2,21,000, అలాగే హైదరాబాద్‌కు చెందిన కర్రి అప్పిరెడ్డి నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామి వారి ప్రత్యేక దర్శన సౌకర్యాన్ని కల్పించారు.

జూదరుల అరెస్ట్

భీమడోలు: కోరుకొల్లులో కోడి పందాల శిబిరంపై బుధవారం భీమడోలు పోలీసులు దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.2200 నగదుతో పాటు ఒక కోడి, ఒక కత్తిని స్వాధీనం చేసుకున్నారు. భీమడోలులోని ఆరుంధతీ కాలనీలో సాయంత్రం పేకాడుతున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రూ.9700 లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఇదిలా ఉండగా.. పూళ్లలో రైల్వే ఉద్యోగి ఇంటిలో చోరీ జరిగింది. బీరువా పగల కొట్టి రూ.1.60 లక్షల విలువ చేసే బంగారు, వెండి వస్తువులను దొంగలో దోచుకెళ్లినట్టు సమాచారం.

ఉన్ని దుస్తులకు భలే గిరాకీ

- చలిని తట్టుకునేందుకు ఉన్ని వస్త్రాలపై ప్రజల దృష్టి
- ఇటీవల పెరిగిన చలి తీవ్రత



భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల దుకాణం

భీమడోలు: చలికాలం వచ్చిందంటే చాలు గజగజ వణికించే చలిని తట్టుకునేందుకు అన్ని దుస్తులు ధరించాల్సిందే. చలి ఉధృతి నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి ఒక్కరూ ఉన్ని దుస్తులను వేసుకోవాలి. సాయంత్రం 5 నుంచి మరసటి రోజు ఉదయం 9 గంటల వరకు చలి ప్రభావం తగ్గడం లేదు. కొన్ని రోజుల క్రితం వర్షాలు కురవడంతో చలి ప్రభావం పెద్దగా లేదు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. దీనితో చలితో ప్రజలు వణికిపోతున్నారు. చలి, మంచు నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లల నుంచి వృద్ధుల వరకు ఈ వస్త్రాలు బాగా ఉపకరిస్తాయి. దీనితో ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరుగుతుంది. దీనితో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఎక్కువగా మంకీ టోపీలు, మఫ్లర్లు, ఉన్ని స్వెట్టర్లకు గిరాకీ పెరిగింది. భీమడోలు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన ఉన్ని దుస్తుల విక్రయాలు మరింత జోరందుకున్నారు. మధ్య తరగతి నుంచి సాధారణ ప్రజలకు ఈ దుకాణం వద్ద అన్ని రకాల ఉన్ని వస్త్రాలు లభ్యమవుతుందడడంతో జనం ఎగబడుతున్నారు. గతం కన్నా ఈ ఏడాది వ్యాపారాలు ఆశాజనకంగా లేవని వ్యాపారులు అంటున్నారు. ప్రజల వద్ద కూడా డబ్బులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో అవసరమైన వాటిని కొనుగోలు చేస్తున్నారు. పెద్దలు, మహిళలు, పిల్లల కోసం ఉలెన్ జర్కిన్లు, మంకీ టోపీలు, రగ్గులు, శాలువాలు, మఫ్లర్లు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఒకొక్కటి రూ.300 నుంచి రూ.3 వేల వరకు ఉన్ని వస్త్రాలు వాటి నాణ్యత ఆధారంగా లభ్యమవుతున్నాయి. రెయిన్ కోట్లు, మంకీ టోపీలు, స్వెట్టర్లు, దుప్పట్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. స్వెట్టర్లు రూ.400 నుంచి రూ.600, మంకీ టోపీలు రూ.100 నుంచి రూ.150, దుప్పట్లు రూ.350 నుంచి రూ.1,300 వరకు పలుకుతోందని కొనుగోలుదారులు అంటున్నారు. కొన్ని నెలలుగా మధ్యప్రదేశ్‌కు చెందిన యువకులు ఇక్కడ దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని జీవనోపాధిని కొనసాగిస్తున్నారు.



ఆకర్షణీయంగా స్వెట్లరు

కొన్ని రోజులుగా చలి పెరిగింది



కొన్ని రోజులుగా చలి పెరిగింది. దీనితో ఉన్ని వస్త్రాల విక్రయాలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది గతేడాది కన్నా చలి తక్కువగా ఉంది. చలి పెరిగితేనే మా వ్యాపారం జరుగుతుంది. ఉన్ని వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ప్రజలు అంతగా ముందుకు రావడం లేదు. మరో రెండు నెలల పాటు ఇక్కడ ఉంటాం. నవంబర్ నుంచి అమ్మకాలు ప్రారంభించాం.

– ప్రకాష్, మధ్యప్రదేశ్, వ్యాపారి

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: దొరసానిపాడులో పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసి, రూ.22,700 నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు.